క్లుప్తంగా

ముగిసిన మహాయాగం



ప్రవచనాలు చేస్తున్న పీఠాధిపతులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న అతిరుద్ర మహాయాగం శుక్రవారం ముగిసింది. ఉదయం పూర్ణాహుతి, అభిషేకంతో ప్రారంభమై పీఠాధిపతుల ప్రవచనాలతో సాయంత్రం ఊరేగింపుతో ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన పీఠాధిపతులకు నిర్వాహక కమిటీ సభ్యులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో పూజారులు, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్కు పరిరక్షించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న వార్డు కౌన్సిలర్

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు రెడ్డి కాలనీ పార్కును పరిరక్షించాలని కోరుతూ ఆ వార్డు కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్‌లకు వినతిపత్రం అందించారు. రెడ్డికాలనీలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద లే ఔట్ స్థలంలో ఇటీవల రూ.40లక్షల పట్టణ ప్రగతి నిధులతో పార్కు నిర్మాణం చేపట్టారని, సరైన నిర్వహణ లేక, పార్కులోని పిల్లల ఆట వస్తువులు, జిమ్ పరికరాలు కొన్ని పాడై, పచ్చదనం లేదని అన్నారు. పార్కులో పనులను చేపట్టి, పరిరక్షించాలని కోరారు.


వ్యవసాయ కళాశాల విద్యార్థుల పర్యటన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని ఆదిల్‌పేట్ గ్రామపంచాయతీని శుక్రవారం జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శివకృష్ణ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు సుమన్, లింగస్వామి, వంశీ, వెంకటేష్, నవీన్ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎంవీఐలను కలిసిన ఆర్టీసీ అధికారులు



అధికారులకు పుష్పగుచ్ఛాలు ఇస్తూ...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంవీఐలను ఆర్టీసీ అధికారులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జి డీటీఓ టి.సంతోశ్‌కుమార్‌తో పాటు ఎంవీఐలు ఏ.కిశోర్‌చంద్రరెడ్డి, సీహెచ్.రంజిత్, ఏఎంవీఐ షేక్ ఖాసింసాహెబ్‌లను మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్, ఆర్టీసీ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

'పల్స్‌పోలియో' విజయవంతం చేయాలి



దండేపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ

దండేపల్లి: ఈ నెల 3న నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, అంగన్ వాడీ టీచర్లు, ఆశాలతో పల్స్‌పోలియోపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 0–5ఏళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఎంపీడీవో ప్రసాద్, దండేపల్లి, తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సతీష్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఆగని భూ కబ్జాలు

- ప్రభుత్వ భూములకు రక్షణ కరువు
- ఖాళీ స్థలం కనిపిస్తే వాలిపోతున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. ఖాళీగా భూమి కనిపిస్తే చాలు ఎక్కడికక్కడ కబ్జాలకు తెగబడుతున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని గంటల వ్యవధిలోనే పునాదులు కట్టించి ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. శరవేగంగా భూ ఆక్రమణలు జరుగుతున్నా నివారణ చర్యలు తీసుకోవడం లేదు. రాజకీయ నాయకులు, చోటామోటా ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు కొందరు విలువైన భూములపై కన్నేసి ఆక్రమణల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ భూములు పరాధీనమవుతున్నా రెవెన్యూ అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



ఆక్రమిత భూమిలో కడుతున్న ఇంటి పునాది

అంబేద్కర్ రడగంబాల బస్తీలో...

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి అంబేద్కర్ రడగంబాల బస్తీలో బుధాకలాన్ శివారు సర్వే నంబర్ 170లో ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేసి రెండు, మూడు రోజుల నుంచి కబ్జాల పర్వాన్ని సాగిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి(కాకా) జ్ఞాపకార్థంగా ఇందిరమ్మకాలనీ పేరుతో బోర్డును ఏర్పాటు చేసి పేదలను ముందుంచి కొందరు భూ ఆక్రమణ చేస్తున్నట్లు తెలుస్తోంది. పిచ్చి మొక్కలను నరికేసి భూమి చదును పనులు నిర్వహించారు. ఆక్రమిత భూ భాగంలో ఎంచక్కా ఇళ్ల నిర్మాణాల కోసం రాయితో పునాదిని నిర్మిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ఇళ్లకు పునాది కట్టి ఉండగా, ఇంకా అనేక మంది ఆ యత్నాల్లో ఉన్నారు. బండ రాళ్లను, ఇసుకను తెప్పించే సన్నాహాల్లో మరి కొందరు నిమగ్నమయ్యారు. మొత్తానికి ఆ ప్రాంతమంతా ఓ కాలనీ మాదిరిగా ఏర్పాటు చేయడానికి చకచక పనులు సాగిస్తున్నారు. ఇదే స్థలాన్ని గతంలో కొందరు కబ్జాకు యత్నించడంతో అప్పట్లో ప్రభుత్వ అధికారులు అడ్డుకుని నివారించారు. తాజాగా అదే భూమి ఆక్రమణకు గురవుతుండటం గమనార్హం.

గుంటకు రూ.2లక్షలు...!

బెల్లంపల్లిలో ఖాళీ భూములకు ఎనలేని డిమాండ్ ఉంది. అదే అవకాశంగా తీసుకుని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆక్రమణ చేసిన ప్రభుత్వ భూమిని గుంట చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గుంటకు కనిష్టంగా రూ.1.50లక్షల నుంచి గరిష్టంగా రూ.2లక్షల వరకు అమ్ముతున్నట్లు లోకం కోడై కూస్తోంది. ఈ పాటికే ఆక్రమణ దారులు పలువురి వద్ద అడ్వాన్స్ రూపేణా రూ.30వేల చొప్పున వసూలు చేశారనే ప్రచారం జరుగుతోంది.



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కాలనీ బోర్డు

తెరవెనుక తాజా, మాజీలు...

అంబేద్కర్ రడగంబాల బస్తీలో జరుగుతున్న భూ కబ్జా వెనుక మున్సిపల్ తాజా, మాజీ ప్రజాప్రతినిధుల హస్తం ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఓ రెండు ప్రధాన రాజకీయ పార్టీల్లో పనిచేస్తున్న మున్సిపల్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు వెన్నుదన్నుగా ఉండి కబ్జాలను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ ముఖ్యమైన రాజకీయ పార్టీకి చెందిన ఇద్దరు నాయకుల 'హస్తం ' ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. భూముల ఆక్రమణను అడ్డుకోవాల్సిన నాయకులే తెరవెనుక ఉండి దందాను నడిపిస్తుండటంతో సర్వత్రా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

టీమ్‌ల ఏర్పాటుకు చర్యలు...

ప్రభుత్వ భూముల కబ్జాల నివారణకు ఆర్డీవో పర్యవేక్షణలో టీమ్‌ల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. ఆ టీమ్‌లు మున్సిపాలిటీ పరిధిలో, శివారు ప్రాంతాల్లో సందర్శించి అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటాం. ఈ చర్య అతి త్వరలో చేపట్టడానికి ఆర్డీవో ఈ పాటికే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రాధాన్యం వివరించారు. ప్రభుత్వ భూముల కబ్జాను విడిచి పెట్టం.

\- కే.వై ప్రసాద్, తహసీల్దార్, బెల్లంపల్లి



కత్తరశాల రోడ్డులో అక్రమంగా నిర్మిస్తున్న ఇల్లు

ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలు

- పట్టించుకోని అధికారులు

చెన్నూర్: ప్రభుత్వ భూములలో అక్రమ ఇంటి నిర్మాణాలు ఆగడం లేదు. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. పట్టా భూములలో అన్ని పత్రాలు సక్రమంగా ఉండి, ఇంటి నిర్మాణ అనుమతులు పొందిన వారినే ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు.. అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా పట్టించుకోకపోవడంలోని ఆంతర్యం ఏమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే...

రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోని సర్వే నంబర్ 816, 864, 863లలో గల లావణి పట్టా భూములలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అవసరాలకు ఉపయోగపడే లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికా రులు స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మల్లిఖార్జున్‌ను వివరణ అడగ్గా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విషయం నా దృష్టికి రాలేదు. అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని పంపించి పనులు ఆపేస్తామన్నారు.



వ్యవసాయ మార్కెట్ కార్యాలయం పక్కన నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

కొనసాగుతున్న 'ధరణి' వెరిఫికేషన్



భీమారం: డ్రైవ్‌లో పాల్గొన్న తహసీల్దార్, సిబ్బంది

వేమనపల్లి: ధరణి పోర్టల్ సమస్యలపై శుక్రవారం తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో వెరిఫికేషన్ కార్యక్రమం చేపట్టారు. మండలంలో మొత్తం 89ధరణి పెండింగ్ అప్లికేషన్లు ఉన్నట్లు తెలిపారు. మొదటి రోజు 8పాస్ బుక్కు సవరణలు, ఒక విరాసత్ సమస్యను తహసీల్దార్ పరిధిలో పరిష్కరించేందుకు నివేదిక సిద్ధం చేశామన్నారు. 80సమస్యలు తొమ్మిది రోజుల్లో పరిష్కారిస్తామన్నారు.

భీమారం: ధరణి సమస్యలను పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ సదానందం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ధరణిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ధరణితో ఏర్పడ్డ సమస్యలను రైతుల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ స్రవంతిలతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి న్యాయం చేయాలి

చెన్నూర్: పట్టణానికి చెందిన పెద్దకొండ లక్ష్మీరాజం అనే రైతుకు న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపినాథ్, పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు ఎం.భవాని, పీవైఎల్ చెన్నూర్ డివిజన్ కార్యదర్శి తగరం వెంకటేశ్ అన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట రైతు కుటుంబ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో రైతు లక్ష్మీరాజం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. లక్ష్మీరాజం మార్కెట్ కమిటీ కార్యాలయం సమీపంలో భూమి ఉందని, నాలుగు రోజుల క్రితం వచ్చారని తహసీల్దార్ మల్లికార్జున్ తెలిపారు. శుక్రవారం లక్ష్మీరాజంతో పాటు మరికొందరు కార్యాలయానికి వచ్చి అడగారని, రికార్డులు పరిశీలించాలని రికార్డు అసిస్టెంట్‌కు చెప్పినట్లు తెలిపారు. కార్యాలయం వద్ద ఎలాంటి ఆత్మహత్య యత్నం జరగలేదని, ఎవరూ అడ్డుకోలేదని పేర్కొన్నారు.

ఆరోగ్యఉపకేంద్ర భవనానికి భూమిపూజ

జైపూర్: మండలంలోని ఇందారంలో నూతనంగా నేషనల్ హెల్త్ మిషన్ స్కీం కింద రూ.20లక్షలతో నిర్మించే ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సబ్ సెంటర్ల వారీగా ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం కాసీంపెల్లిలో ఉపాధి హామీ పథకం కింద నూతనంగా రూ.4లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గణపతి, కుందారం వైద్యాధికారి శ్రావ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

రోడ్డు నిర్మించాలని వినతి

భీమారం: మండలంలోని అంకూసాపూర్ క్రాస్ రోడ్డు నుంచి ఎలకేశ్వరం గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఎలకేశ్వరం గ్రామస్తులు శుక్రవారం భీమారం మండలం కొత్తపల్లికి వెళ్తున్న చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి అంకూసాపూర్ వద్ద ఆపి వినతిపత్రం అందజేశారు. రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆరోపించారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బెల్లంపల్లి: విద్యార్థులు చదువుతోపాటు న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీఎస్ .ప్రవీణ్‌కుమార్ అన్నారు. డిగ్రీ కళాశాల ఇంటర్నల్ కంప్లెట్స్ కమిటీ(ఐసీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం వర్క్ ప్లేస్ ఎథిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. బాలికలు చదువులో భాగంగా అనేక అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా న్యాయ పరమైన అంశాలు, వాటికి సంబంధించిన చట్టాలను తెలుసుకోవడానికి శ్రద్ధ చూపాలన్నారు. సందర్భ సహితంగా వాటిని మానవీయ కోణంలో వినియోగించుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఐసీసీ కన్వీనర్ శ్రీలత, న్యాయవాది సంగీత, ఐసీసీ కమిటీ సభ్యులు ఎం.రేష్మ, ఎస్.శ్రీనివాస్, అరుణ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

- రిమాండ్‌కి తరలింపు

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియాలోని తాళం వేసి ఉన్న ఓ ఇంటిలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని శ్రీరాంపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ తెలిపిన కథనం ప్రకారం.. శ్రీరాంపూర్ ఏరియాలోని వాటర్ ట్యాంక్ ఏరియాలోని కొర్రె నాగార్జున ఫిబ్రవరి 28న తన ఇంటికి తాళం వేసి ఊరికెళ్లారు. ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా.. శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన మోసిన్ షేక్ అనే వ్యక్తి తాళాలు పగులగొట్టి బీరువాలోని రెండు తులాల గోల్డ్ చైన్, 15తులాల వెండీ పట్టీలు దొంగతనం చేసినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకుని దొంగతనం చేసిన సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సంతోష్

షాదీఖానా భూమి కబ్జాపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కబ్జాకు గురైన షాదీఖానా భూమిని తిరిగి స్వాధీనం చేయాలని కోరుతూ ముస్లిం నాయకులు అమానుల్లాఖాన్, అన్వర్ ఖాన్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు వెళ్లి దరఖాస్తును అందజేశారు. ఆ తర్వాత బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇంటికి వెళ్లి షాదీఖానా భూ కబ్జా గురించి వివరించి వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

వాడీవేడిగా మండల సమావేశం



నివేదిక చదువుతున్న ట్రాన్స్‌కో ఏఈ

తాండూర్: మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. నివేదికల ప్రకారం మిషన్ భగీరథ పనులు పూర్తయినట్లు ఉన్నాయని, కానీ ఇప్పటికీ చాలా చోట్ల పనులు పూర్తికాకుండానే బిల్లులు తీసుకున్నారని సభ్యులు ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కేంద్రాల పనితీరు అస్తవ్యస్తంగా మారిందన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి సమస్య, పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, సింగిల్ విండో చైర్మన్ దత్తుమూర్తి, వైస్ ఎంపీపీ దాగం నారాయణ, సిరంగి శంకర్, మొగిలి శంకర్, పెరిక రజిత, రెబ్బెన యశోద, గోమాస స్వాతి పాల్గొన్నారు.

వేలాల జాతర నిర్వహణ కమిటీ సభ్యులకు సన్మానం

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల శ్రీ మల్లన్న స్వామి జాతర ఏటా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు వైభవంగా సాగుతోంది. మార్చి 8న జరిగే జాతర నిర్వహణలో భాగంగా దేవాదాయశాఖ 12మంది కమిటీతో జాతర నిర్వహణ కమిటీని నియమించింది. సమీప ప్రాంతాలకు చెందిన వొడ్నాల వెంకటస్వామి, రామటెంకి సమ్మయ్య, కొత్తం శ్రీనివాస్, పిడుగు వెంకన్న, లంబు రంగారెడ్డి, మూల అశోక్‌రెడ్డి, తాటిపల్లి అంజన్‌గౌడ్, చిలకల పోచం, అగ్గిమెంట్ల తిరుపతి, సుందిళ్ల దేవయ్య, సుందిళ్ల రాజలింగు, గోపనవేని శైలును నియమించగా ఆలయ ఈవో రమేశ్ కమిటీ సభ్యులను సన్మానించారు.



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఆలయ ఈవో రమేశ్

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

జన్నారం: ఉట్నూర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం టెక్నికల్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు జన్నారం మండల వాసి మేకల అక్షయ్‌కుమార్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఏకైక గిరిజన ప్రభుత్వ ఆదర్శ సాంకేతిక కళాశాల(పాలిటెక్నిక్ కాలేజీ)ని ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. కళాశాల విద్యార్థులకు డిప్లొమా కోర్సు పూర్తయ్యేవరకు ఏ విధమైన ఫీజుల భారం లేకుండా ఉచిత పుస్తకాలు, దుస్తులు, హాస్టల్ వసతి కల్పించాలని కోరారు. కళాశాలలో చదివే డే స్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. కళాశాలకు సంబంధించిన బోధనేతర, బోధన, వసతి గృహానికి సంబంధించి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అత్యంత డిమాండ్ కలిగిన సీఎస్/ఏ1 కోర్సులను ప్రారంభించి, అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు అక్షయ్‌కుమార్ తెలిపారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న అక్షయ్‌కుమార్

'స్మార్ట్‌కిడ్స్'లో ఎడ్యు-కార్నివాల్



ఎడ్యుకార్నివాల్‌లో విద్యార్థుల ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: స్థానిక స్మార్ట్‌కిడ్స్ స్కూల్‌లో శుక్రవారం ఎడ్యు-కార్నివాల్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన 108ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయటానికి ఎడ్యు-కార్నివాల్‌ను నిర్వహించామని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. పాఠశాల విద్యార్థులు ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకించారు.



ప్రాజెక్ట్‌లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సెయింట్ జాన్స్‌లో 'ఎడ్యు-కార్నివాల్'

రామకృష్ణాపూర్: పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో శుక్రవారం 'ఎడ్యు-కార్నివాల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించి సుమారు 148ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయటానికి ఎడ్యు-కార్నివాల్‌ను నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

నూతన తహసీల్దార్‌కు డీలర్ల సన్మానం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె.రమేశ్, డిప్యూటీ తహసీల్దార్ సతీశ్‌లను మండల రేషన్ డీలర్లు శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు మహేందర్, తిరుపతి, వెంకటస్వామి, శ్రీధర్, ధర్మేందర్, బానేశ్, సారంగపాణి, అశోక్, కేశవరావు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల దినోత్సవం

చెన్నూర్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, ప్రశాంత్, మల్లేశ్, సతీశ్, శ్రీధర్, పోచం, దేవయ్య, రాజం, పున్నం, ఆగయ్య, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

మొక్కలకు నీటిని అందించాలి

లక్సెట్టిపేట: వేసవి కాలంలో మొక్కలకు ప్రతి రోజూ నీటిని అందించాలని ఎంపీడీవో సరోజ అన్నారు. మండలంలోని హన్మంతుపల్లి, చందారం, రంగపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించి మాట్లాడారు. వేసవి కాలం సమీపిస్తున్నందునా నీటిని అందిస్తూ మొక్కలను కాపాడాలని సూచించారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలపై హర్షం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విధి నిర్వహణలో ఉంటూ అకాల మరణం చెందిన పూర్వ వీఆర్వోల కుటుంబాలకు అర్హతల మేరకు కారుణ్య నియామకాలను చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేయడంపై తెలంగాణ పూర్వ వీఆర్ఓల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సుర్మిళ్ల స్వామిదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

వార్డులో పర్యటించిన చైర్‌పర్సన్

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని 2, 16వార్డులలో చైర్‌పర్సన్ జక్కుల శ్వేత పర్యటించారు. ఆయా వార్డుల పరిధిలో ఉన్న ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల కళాశాల మురికి నీటి కాలువ సరిగ్గా లేక, కాలువలో నీరు స్థిరంగా నిలిచిపోయి దుర్వాసన వస్తున్నట్లు స్థానికులు చైర్‌పర్సన్‌కు విన్నవించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన చైర్‌పర్సన్ పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజలింగు తదితరులు ఉన్నారు.